క్లుప్తంగా

మాజీ వైస్ ఎంపీపీకి ఎమ్మెల్యే పరామర్శ



విస్సన్నపేట: విస్సన్నపేట మండల మాజీ వైస్ఎంపీపీ ఓలేటి దుర్గారావును ఎమ్మెల్యే రక్షణనిధి పరామర్శించారు. దుర్గారావు వదిన గరికపాటి సత్యవతి ఇటీవల మృతిచెందగా, ఎమ్మెల్యే రక్షణనిధి శుక్రవారం ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దుర్గారావుతోపాటు కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించినవారిలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీసభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అనుమోలు శివబాజీ ఉన్నారు.

యోగాలో విశేష ప్రతిభ



ఏ.కొండూరు: రాష్ట్రస్థాయిలో జరిగే స్కూల్ ఫెడరేషన్ పోటలకు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు జి. కవిత శుక్రవారం తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాణావత్ పవన్‌కుమార్ ఈనెల 12వ తేదీన విజయవాడలో జిల్లా స్థాయిలో జరిగిన యోగా పోటీల్లో విశేష ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థి పవన్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

జి.కొండూరు: నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని ఎన్టీఆర్ జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ జి మహేశ్వరరావు సూచించారు. స్థానిక కమ్యూనిటీ హాలులో పాఠశాలల హెచ్ఎంలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా స్థానిక జెడ్పీహైస్కూల్లో నిర్వహించిన నా మట్టి నాదేశం కలశ ప్రదర్శనలో ఆయన పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు.

రేపటి నుంచి పోటీలు

తిరువూరు: దసరా పండుగను పురస్కరించుకుని స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి కె.పద్మావతి తెలిపారు. ఈ నెల 15 నుంచి 21వరకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం, చదరంగం, పేపర్ క్రాఫ్ట్ తయారీ, భగవద్గీత పద్యపోటీలు నిర్వహిస్తామని వివరించారు. విజేతలకు ఈనెల 24న బహుమతులు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయంలో సంప్రదించి, ఆయా పోటీలకు పేర్లు నమోదు చేయించుకోవాలని ఆమె సూచించారు.

బ్యాంకు మేనేజర్‌పై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: డ్వాక్రా మహిళల పొదుపు ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసుకోకుండా మహిళలను ఇబ్బందులు పెడుతున్న మూలపాడు సప్తగిరి బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డిపై ఎంపీపీ పాలడుగు జోత్స్న శుక్రవారం జిల్లా కలెక్టర్ డిల్లీరావుకు ఫిర్యాదు చేశారు. డ్వాక్రా మహిళల పొదుపు ఖాతాల్లో సుమారు రూ.5లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఉండగా సభ్యులను డ్రా చేసుకోకుండా మేనేజర్ అడ్డుకుంటున్నట్లు గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గొట్టుముక్కల కోటేశ్వరరావు సమస్యను ఎంపీపీ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె వెంటనే స్పందించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.సమస్యను పరిష్కరించాలంటూ కలెక్టర్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావును ఆదేశించినట్లు కోటేశ్వరరావు తెలిపారు.

బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు

మైలవరం: ప్రతిఒక్కరూ తమ బ్లడ్‌గ్రూప్‌ను తెలుసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి సూచించారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. కళాశాలలో 178మంది విద్యార్థులు బ్లడ్‌గ్రూప్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. వైఆర్‌సీ కో ఆర్డినేటర్ మేజర్ మన్నే స్వామి పాల్గొన్నారు.

సుబ్రమణ్య భారతి సేవలు ప్రశంసనీయం

మైలవరం: భారతీయ సాహిత్యానికి సుబ్రమణ్య భారతి చేసిన సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి కొనియాడారు. మైలవరం 6వ వార్డులోని ఎంపీపీ పాఠశాలలో భారతీయ భాషా ఉత్సవ్‌ను నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.తిరుపతిరావు, వైస్ ఎంపీపీ షేక్ రహీమ్, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, ఎంఈవో ఎల్.బాలు, ప్రధానోపాధ్యాయులు పి.గోపాల్, పిఎంసీ చైర్మన్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆజాదికా అమృతోత్సవం

గంపలగూడెం: స్థానిక జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆజాదికా అమృత మహోత్సవాల్లో భాగంగా 'నాభూమి-నాదేశం' కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గంపలగూడెం మండలంలోని 24 పంచాయతీల నుంచి సేకరించిన మట్టిని జాతికి అంకితం చేశారు. సామాజిక కార్యకర్త దీక్షిత, హెచ్ఎం కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే జగనన్న ధ్యేయం



తిరువూరు వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.రక్షణనిధి



కొటికలపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్

తిరువూరు: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పట్టణస్థాయి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే రక్షణనిధి మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఇప్పటికే ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని వివరించారు. నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు గుమ్మా వెంకటేశ్వరి, వెలుగోటి విజయలక్ష్మి, కమిషనర్ బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్లు మంజుల, ప్రకాష్‌రెడ్డి, పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, కొలికపోగు నిర్మల, దేవిశెట్టి బాలకృష్ణ పాల్గొన్నారు.

జి. కొండూరు మండలంలో..

జి.కొండూరు: మండలంలోని మునగపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల ఆరోగ్యానికి భరోసా లభించిందని కొనియాడారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు కాజా బ్రహ్మయ్య, ఎంపీటీసీ సభ్యురాలు రమావత్ నాగమణి, మునగపాడు, సున్నంపాడు, చెర్వుమాధవరం సర్పంచ్‌లు పగడాల వెంకటేశ్వరరావు, దేశం సుదాకర్‌రెడ్డి, సరస్వతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నెల్లూరి లీలా శ్రీనివాసరావు, తహశీల్దార్ రోహిణీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విస్సన్నపేట మండలంలో...

విస్సన్నపేట: అందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. విస్సన్నపేట గ్రామ సచివాలయం-3 పరిధిలో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీడీవో ఎస్. వెంకటరమణ, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, కెడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అనుమోలు శివబాజీ, జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ సత్యానారాయణరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శేషగిరి, ఎంపీటీసీ సభ్యుడు జి మల్లయ్య, సీడీపీవో సత్యావతి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం మండలంలో..

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం):రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం దేశానికే ఆదర్శమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కొటికలపూడిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష పథకం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి పాలిట ఓ వరమని చెప్పారు. రోగులకు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న, వైస్ ఎంపీపీ బండి నాగమణి, సర్పంచి రెంటపల్లి నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ జానీ, దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు పాల్గొన్నారు.

పైడూరుపాడులో..

పైడూరుపాడు(విజయవాడరూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కొనియాడారు. పైడూరుపాడు పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు ఈ తరహాలో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించలేదన్నారు. రాష్ట్రంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. వైద్యశిబిరంలో 905మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచి వి.సీతా రామయ్య, ఎంపీటీసీ సభ్యురాలు బయ్యారపు కల్పన , మండల పార్టీ అధ్యక్షుడు కాటంనేని పూర్ణచంద్రరావు, సొసైటీ మాజీ చైర్మన్ రంగినేని సాంబశివరావు, డాక్టర్ రవికిషోర్, ఈవో ఆర్డీ బిఎల్‌వీ శేషగిరిరావు, డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

ఈదరలో..

ఆగిరిపల్లి: మండలంలోని సీతారామపురం, కొత్త ఈదరలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. 450 మందికి వైద్యపరీక్షలుచేశారు. సీతారామపురం సర్పంచి అత్తి మురళి, తహశీల్దార్ ఉదయభాస్కర్, ఎంపీడీవో పి.శంకర్‌రావు, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు, నాయకులు గోళ్ల ఇస్సాకు, నందూరి భాస్కరప్రసాద్, ప్రసాద్ వర్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు మండలంలో..

ముసునూరు: ప్రజలకు చక్కని ఆరోగ్యాన్ని అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మండల టీమ్-1 ప్రత్యేకాధికారి, ఎంపీడీవో జి.రాణి ఆధ్వర్యంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డి.ఆశ అధ్యక్షతన శుక్రవారం కొర్లగుంట యూపీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కరీముల్లా, కిరణ్‌కుమార్, ప్రతాప్, అవినాష్, ప్రత్యేక వైద్య నిపుణులు సురేష్, ప్రసూతి వైద్య నిపుణురాలు స్వప్న సింధు 459 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతోపాటు ప్రజలందరికీ మంచి ఆరోగ్యం అందించడం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీపీ ఆర్.కృష్ణ కుమారి, వైస్ ఎంపీపీ రాజానాయన, ఎంపీటీసి దుర్గాభవాని, సర్పంచ్ సత్యనారాయణ, మండల వైఎస్సార్ సీపీ, సొసైటీ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, తహశీల్దార్ డి.సుధ, ఎంఈఓ బీవీ సుబ్బారావు, ఈఓపీఆర్డీ సత్యనారాయణ వలంటీర్లు పాల్గొన్నారు.

నూజివీడు మండలంలో..

నూజివీడు: ప్రజల ఆరోగ్య పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. మండలంలోని సుంకొల్లులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఎంపీపీ శిరీష ప్రారంభించారు. ఎంపీడీవో వీపీ విజయ్‌కుమార్, సర్పంచి దుడ్డు నాగమల్లేశ్వరరావు,ఆరేపల్లి రాంబాబు, ముల్లంగి జమలయ్య, వైద్యులు పాల్గొన్నారు.

వల్లంపట్ల గ్రామంలో..

ఏ.కొండూరు: మండలంలోని వల్లంపట్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు భూక్య గనియా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడు జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో పేదలు కార్పొరేట్ వైద్యాన్ని పొందుతున్నారని పేర్కొన్నారు. సర్పంచ్ జూపల్లి రాజేష్, ఎంపీటీసీ సభ్యుడు ఏ. వెంకట నర్సారెడ్డి, తహశీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, వైద్యాధికారి స్వాతి, సూపర్‌వైజర్ మురళి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మైలవరం మండలంలో..

మైలవరం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి కోరారు. మైలవరం గ్రామ సచివాలయం-2లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్యం అందుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైద్యశాఖ, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

621 మందికి ఆరోగ్య పరీక్ష

దుందిరాలపాడు(గంపలగూడెం): దుందిరాలపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. మిట్టగూడెం, మెల్లెంపాడు గ్రామాలకు చెందిన 621మంది ఈ శిబిరానికి హాజరయ్యారు. గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీల వైద్యులు శృతి, సురేష్, ప్రత్యేక వైద్య నిపుణులు భానుతేజ, వాసవి పాల్గొని ప్రజలకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో వై.పిచ్చిరెడ్డి, వైయస్సార్‌సీపీ మండల అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, సర్పంచ్ బంక బాబురావు, ఎంపీటీసీ సభ్యులు తాళ్లూరి వెంకట్రావమ్మ, పీఏసీఎస్ అధ్యక్షులు ఉటుకూరు రాంబాబు, ఎంఈవో జి. నరసింహారావు, వలంటీర్లు, ఆశ వర్కర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

చాట్రాయి మండలంలో..

చాట్రాయి: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఆశయమని ఏపీ కోఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని తుమ్మగూడెంలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యులు జె.వెంకటేశ్వరెడ్డి, జి.అరవింద్ జీహెచ్‌సీ వైద్యులు విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, దుర్గా ప్రసాదు, జ్యోతి పాల్గొని 352 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మొలుగుమాటి మారమ్మ, ఎంపీడీవో దుర్గా ప్రసాద్, పీఏసిఎస్ చైర్మన్ మాదల నరశింహారావు పాల్గొన్నారు.



మునగపాడులో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ



దుందిరాలపాడులో ..



సుంకొల్లులో ..



మైలవరంలో ..

రాణిరుద్రమదేవికి పీహెచ్‌డీ ప్రదానం

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల(ఎల్‌బీఆర్‌సీఈ) అధ్యాపకురాలు కె.రాణిరుద్రమదేవి పీహెచ్‌డీ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ తమ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకురాలు రాణి రుద్రమ జేఎన్‌టీయూ(అనంతపురం) ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో 'డిజైన్ అండ్ ఎనలైటిక్స్ ఆఫ్ ప్రాక్టల్ స్లాట్ బైస్డ్ మైక్రోస్ట్రిప్ ప్యాచ్ యాంటెన్నా యూసింగ్ డిఫరెంట్ సబ్ స్ట్రేట్ మెటీరియల్ ఫర్ వైడ్ బ్యాండ్ అప్లికేషన్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు వివరించారు. గుంటూరు డాక్టర్ వైఎస్ఆర్ ఏఎన్యూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.సిద్దయ్య, అనంతపురం జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.గిరిప్రసాద్ పర్యవేక్షణలో ఈ పరిశోధన చేసినట్లు చెప్పారు. ఈ పరిశోధన వైఫై, వై మాక్స్ కమ్యూనికేషన్స్‌కు ఉపయోగపడుతుందని తెలిపారు. పీహెచ్‌డీ అవార్డు అందుకున్న రాణి రుద్రమదేవిని కళాశాల ప్రెసిడెంట్ జీ. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, డాక్టర్ వై.అమర్‌బాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందిచారు.



రాణిరుద్రమదేవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

పాఠశాలల్లో దసరా వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న బాలికలు



గంపలగూడెంలో దసరా సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరువూరు: దసరా పండుగ విశిష్టతను తెలియజేస్తూ తిరువూరు మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వామకుంట్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు బతుకమ్మ ఆటతో సందడి చేశారు. పూలతో బతుకమ్మలను అలంకరించి ఆడిపాడారు. తిరువూరు శ్రీనిధి స్కూలులో దసరా పండుగ విశిష్టత, సంప్రదాయాలను వివరిస్తూ విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

గంపలగూడెంలో

గంపలగూడెం: స్థానిక లిటిల్ ఏంజిల్స్ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన ముందస్తు దసరా సంబరాలు ఆకట్టుకున్నాయి. పలువురు చిన్నారులు ప్రత్యేక వస్త్రధారణతో సాంప్రదాయబద్దంగా ప్రదర్శించిన సాంస్కృతిక అంశాలు చూడముచ్చట గొల్పాయి. చిన్న పిల్లల్లో మన సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించినట్లు డైరెక్టర్ కె. సురేష్ తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా ఆడిపాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. ప్రభాకర్, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీవో సభ్యులకు శిక్షణ తరగతుల నిర్వహణ

ఆగిరిపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో)లకు ప్రాధాన్యతనిస్తున్నట్టు ఏవో పలగాని చెన్నారావు తెలిపారు. ఆగిరిపల్లిలో శుక్రవారం ఎఫ్‌పీవో డైరెక్టర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎఫ్‌పీవో డైరెక్టర్ల విధులు, బాధ్యతల గురించి ఏపీఎం బొలగాని రామకృష్ణ అవగాహన కల్పించారు. నూజివీడు టెక్నికల్ ఏవో సూరిబాబు, ఎఫ్‌పీవో అధ్యక్షురాలు హిమజ, సీహెచ్ లక్ష్మి, చాట్ల వెంకటరత్నం, భాగ్యలక్ష్మి, అరుణకుమారి, టీ సువర్ణ, ఎంఎస్ఏ రజిత పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏవో పలగాని చెన్నారావు

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ



మైలవరం: స్థానిక ఎంబీఎం జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న 35 మంది విద్యార్థినులకు శుక్రవారం రెండు జతల యూనిఫాంను అందజేశారు. వెల్వడం గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు వేమిరెడ్డి వెంకటరెడ్డి సౌజన్యంతో యండూరి సాంబశివరావు ద్వారా యూనిఫాం పంపిణీ చేశారు.హెచ్ఎం పి.లక్ష్మి, హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ముసునూరు: మండలంలోని కొర్లగుంటలో పంచాయతీ రాజ్ డి.ఈ.ఈ డి.వి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ నూతన భవనాన్ని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు శుక్రవారం ప్రారంభించారు. భవనాన్ని చక్కగా నిర్మించారని అభినందించారు. కార్యక్రమానికి వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. పి.స్వరూపరాణి, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ కె.రాజానాయన, స్థానిక సర్పంచ్ ఎస్.సత్యనారాయణ, ఎంపీటీసీ దుర్గాభవాని, ఎంపీడీవో జి.రాణి, తహశీల్దార్ డి.సుధ, ఏఈ దుర్గాప్రసాద్, ఎంఈవో బీవీ సుబ్బారావు, ఈఓపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నూజివీడు అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

ఎమ్మెల్యే మేకా ప్రతాప్

ముసునూరు: నూజివీడు అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నట్టు నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. మండలంలోని కొర్లగుంటలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నూజివీడులో కేంద్రీయ విద్యాలయం తరగతుల నిర్వహణ కోసం నిర్మించిన భవనం పెచ్చులూడిందని వెలువడిన కథనంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రీయ విద్యాలయం మంజూరు కావడం లేదంటూ మీడియాలో వ్యాఖ్యలు చేసిన నోళ్లు మూత పడేలా విద్యాలయం మంజూరు చేయించినట్లు వివరించారు. దీనిని జీర్ణించుకోలేక దుష్ప్రచారం చేయడం సబబు కాదని హితవు పలికారు. అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నూజివీడుకు ఏదైనా నేనే చేస్తా.. నేనే సాధిస్తానని ఆయన అన్నారు. ఎల్లో మీడియాలో అవాకులు చవాకులను, చౌక బారు రాతలను ఖండిస్తున్నట్లు ఆయన చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన

ఇబ్రహీంపట్నం: వ్యవసాయ పొలాల్లో సామూహిక ఎరువుల నిర్మూలన ప్రక్రియ చేపట్టాలని మైలవరం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు సూచించారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలుకల నిర్మూలనకు అవసరమైన ఎర తయారీ విధానం, ఎలుకల బొరియల్లో వేసుకునే పద్ధతిని వివరించారు. 100గ్రాముల విషపు ఎర తయారీకి 96గ్రాముల నూక, 2గ్రాముల నూనె, 2 గ్రాముల బ్రామోడయలిన్ మందు కలపాలని సూచించారు. ఏవో శైలజ, టెక్నికల్ ఏవో వాసుదేవ్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

తిరువూరు మండలంలో

తిరువూరు రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో తిరువూరు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏడీఏ కెనడీ ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామంలో వ్యవసాయ సిబ్బంది ఎలుకల నిర్మూలనకు ఎర తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అన్ని గ్రామాల్లో ఒకేసారి ఎలుకల నిర్మూలనకు పొలాల్లో, బీడుభూముల్లో ఎర వేస్తే పంటపొలాలకు కలుగుతున్న నష్టాన్ని నివారించవచ్చని ఏడీఏ సూచించారు. వ్యవసాయాధికారిణి పద్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ కెనడీ

రైతులకు అందుబాటులో ఎరువులు

నూజివీడు: రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నూజివీడు ఏడీఏ జీ విద్యాసాగర్ సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం మండలం వ్యవసాయ సలహా మండలి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందించే రాయితీలను అందిపుచ్చుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి కమిటీ చైర్మన్ పల్లే రవీంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ఉద్యాన అధికారిణి రాజులపాటి హేమ, పశుసంవర్ధకశాఖ, పట్టు పరిశ్రమ, విద్యుత్‌శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

తిరువూరు: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా తిరువూరు మండలంలో మూడోవిడత రీసర్వే నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు సురేష్ బాబు శుక్రవారం తెలిపారు. పెద్దవరం, ఎర్రమాడు, కోకిలంపాడు గ్రామాల్లో ఈ నెల 15వతేదీకి, లక్ష్మీపురంలో 30వతేదీకి సర్వే పూర్తవుతుందని వివరించారు. రైతులు ఈ సర్వేకు వచ్చిన అధికారులకు తమ భూముల రికార్డులను చూపి సహకరించాలని కోరారు. ఉచితంగా సర్వే చేసి హద్దులు చూపడంతో పాటు సరిహద్దు రాళ్లు పాతిస్తారని వివరించారు.